నేనేం పాపం చేసానని నాకీ భిన్నమైన జీవితం?

నేనేం తప్పుచేసానని నాకీ ఒంటరి మంటల జీవితం?

కాలు, చెయ్యి, కన్ను, ముక్కూ అన్నీ ఉండి ఏమిటీ అంగవైకల్య జీవితం?

ఆత్మలోపించి ఏమీలేని దివాళాకోరు మనిషిగా తయారై, ఎవరూ పట్టించుకోని వింత జీవితం నేనెందుకు గడపాల్సి వస్తోంది?

ఎవరో నన్ను పట్టించుకోవాలని, ఎవరో వచ్చి ధైర్యం చెప్పాలని,ఎవరో వచ్చి నన్ను కని పెట్టి ఉండాలనీ ఏమిటీ అయోమయ అవస్థ?



కథా నిలయం
శ్రీకాకుళం

# ఆత్మలేని మనిషి

చిన్నప్పటి నుంచీ నా బ్రతుకు ఇంతే! బాల్యం, స్కూలు జీవితం, కాలేజీ జీవితం అంతా ఒంటరితనమే! అంతా దిగులు, విషాదమే!

నాకు స్నేహితులు లేరు. అసలు ఎవరితోనైనా ఏం మాట్లాడాలో, వాళ్ళు ఏం చెప్తే దానికి ఏం సమాధానం చెప్పాలో తెలియదు.

ఎవరితోనూ ఏ సంబంధమూ లేదు. స్కూలుకి వెళ్ళడం, ఇంటికి రావడం. నేను వచ్చానో లేదో ఎవరికీ పట్టదు. నేను ఎవరితోనూ మాట్లాడలేను. ఎవరూ నా జోలికి రారు.

వాళ్ళు గుంపులుగా మాట్లాడుకుంటూంటే ఆశ్చర్యపోయేవాడిని. నేనెందుకు ఆ గుంపులో ఉండలేకపోతున్నాను?

నేనెందుకు వాళ్ళల్లా కబుర్లు చెప్పలేకపోతున్నాను? నాదగ్గరకెవ్వరూ రారే? అనుకుని కుమిలిపోయేవాడిని.

పాతికేళ్ళ జీవితంలో స్నేహం, ప్రేమ ఏమీ లేకుండా బ్రతికిన పిచ్చివాడిని నేనే. నాలా ఎవ్వరూ నాకు కనిపించలేదు. నాలాంటి ఆత్మ ఎదగని వాళ్ళు ఎవరూ లేరు. నాలా మానసిక దివాళాకోరు ఎవరూ లేరు. నేను చదివిన పదహారు తరగతులూ చూసుకుంటే నేనే... నేనే... నేనే ఒంటరివాడిని. నేను అసలు వాళ్ళ క్లాసుల్లో చదివానని ఇపుడు వెళ్ళి చెబితే వాళ్ళు నన్ను పోల్చుకోలేరు. అంత భయంకరమైన ఒంటరి జీవితం గడిచింది.

నా దగ్గరకెవరొచ్చినా ఇప్పటికీ భయం. వాళ్ళు ఏమడుగుతారు? నేనేం చెప్పాలి? తెలియదు. నేనేం మాట్లాడాలి? తెలియదు. ఏమీ తెలియదు. అయోమయం. అందుకే పలకరించాలని వచ్చినా ఒకటి రెండు మాటలతో పారిపోతారు. మరి రారు.

నా మొఖం చూస్తేనే ఛో... ఛో... అన్నట్లు ఎవరూ రారు.

ఈ ఒంటరి బ్రతుకులో భయం, ఆందోళన, సిగ్గు, బిడియం, మౌనం వాటిష్టంవచ్చినట్లు అవి దయ్యాల బంగళాలో గుడ్లగూబల్లా, గబ్బిలాల్లా రాజ్యం ఏలుతున్నాయి. వాటిని పారదోలేందుకు ఏం చేయాలో తెలియదు. చేయగలనో లేదో తెలియదు. వాటిని భరిస్తూ బ్రతుకు ఈడ్చడమే నేను చేస్తున్నది.

...ఇపుడు ఈ ఇంటర్వ్యూ నా ముందు పెద్ద రాక్షసి నుంచున్నట్లుగా ఉంది. నా ముందు ఒక అగ్నిగుండం పేర్చినట్లుగా ఉంది.

ఒక్కమనిషితోనే సవ్యంగా మాట్లాడలేని నేను అంతమంది ముందు కూర్చోవటమా? కూర్చుని వాళ్ళ కళ్ళల్లోకి చూడడమా? చూసి వాళ్ళడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడమా? ఇవన్నీ సాధ్యమయ్యేవేనా? ఎంత మాత్రం కావు. ఇదంతా అసాధ్యం. నేను వాళ్ళముందు కెళ్ళలేను, వెళ్ళి వాళ్ళ కళ్ళల్లోకి చూడలేను, మాట్లాడ

ఎ. ఉదయభాస్కరరావు

లేను. ఇవేమీ జరగవు. నా వల్ల కాదు.

కానీ ఉద్యోగం?... ఇంటర్వ్యూకెళ్ళకపోతే ఉద్యోగం ఎలా వస్తుంది? ఎంతో కష్టపడి బి.యిడి. సీటు తెచ్చుకుని, చేసి, పరీక్ష వ్రాసి, డిగ్రీ తెచ్చుకుని, డియస్సి పరీక్ష పాసై ఇంటర్వ్యూ దాకా వస్తే... ఇక్కడ నుంచి ముందుకెళ్ళలేని స్థితి.

ఇంతవరకూ ఇలాంటి స్థితి ఎదురుకాలేదు నాకు.

చదువుకునేటపుడు, పరీక్ష రాసేటపుడు ఒక్కడినే కనుక సరిపోయేది. నన్ను ఎవరూ పట్టించుకునేవారు కాదు. నా మానాన నేను నా పని చేసుకునేవాడిని. ఎవరితోనూ సంబంధం ఉండేది కాదు. ఇపుడు పెద్ద పెద్ద ఆఫీసర్లు ఇంటర్వ్యూ చేయడం... లేదు... నా వల్ల అయ్యే పని కాదు.

"ఏంట్రా ఏదో పోస్ట్ అన్న కేక వినపడింది"

"అవునమ్మా... టీచర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది"

"వచ్చిందా? బాగుంది ఎపుడు జాయిన్ అవ్వాలి?"

"ఉద్యోగం కాదమ్మా. ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ"

"అబ్బ ఉద్యోగానికి ఎన్ని అడ్డాలురా... అదేదో అయిపోయి, ఉద్యోగం వచ్చేస్తే నువ్వో దారిలో పడతావు" వెళ్ళబోతూ ఆగి, "కవరు చింపి ఈ కాగితం ముక్క ఇక్కడే పడెయ్యకపోతే బయట పారెయ్యకపోయావా? అంది. ఆ పని చేసాను.

నా బాధలు చెప్పుకోవడానికిగాని, నా ఆవేదన వినడానికి గానీ నాకెవ్వరూ లేరు. నేను పడుతున్న ఈ ఆందోళన నన్ను తినేస్తోంది. చంపేస్తోంది. కాల్చేస్తోంది. ఎవరికి కావాలి? ఎవరికి తెలుస్తుంది? ఎలా తెలుస్తుంది? ఎందుకీ బ్రతుకు?... చావడానికీ భయమే. బ్రతుకేమో బాధ. ఎటూ దారిలేని, దిక్కుతోచని అయోమయస్థితి.

3వ తారీఖు ఇంకా ఎన్ని రోజులుంది?

ఇవాళ 29 అంటే 30, 31, 1, 2, నాలుగు రోజులు ఉంది. ఐదో రోజున ఇంటర్వ్యూ.

నాన్న ఏదో ఊరి నుంచి వచ్చినట్లున్నారు. ఎదురుగా ఉన్న నాకేసి చూడకుండానే లోపలికి వెళ్ళిపోయారు. అదంతే... నేను పుట్టినప్పటి నుంచీ అంతే. దానివల్లనే నా బ్రతుకు ఇలా అయింది. ఈ రోజు అనుకుని ఏం లాభం?

కొద్దిసేపటి తరువాత బయటకు వచ్చి "ఏరా ఇంటర్వ్యూ వచ్చిందట? ఉద్యోగం కూడా వస్తుందా?" అనేసి లోపలికి వెళ్ళిపోయారు.

రెండో ప్రశ్న నన్ను సందేహిస్తున్నట్లుగా నాకు అనిపించింది. 'ఉద్యోగం రావాలి... తెచ్చుకోవాలి శ్రమపడు...' ఇలా అని ఉంటే... 'మళ్ళీ ఎందుకురా అలా ఆలోచిస్తావు? పాతికేళ్ళు లేని, రాని మాటలు ఇప్పటికిప్పుడు వచ్చేస్తాయా?'

'నాన్నా నాకు ఆందోళనగా, భయంగా ఉంద'ని అంటేనో?...

అంటే ఏమంటారు? 'ఎందుకు భయం, వాళ్ళేం తింటారా? చంపుతారా? మగాడివి కాదురా?' అంటారు. అమ్మ అయితే 'ఆడముండలా ఆ మాటలేంట్రా? దేభ్యం మొఖం వేసుకొని కూచోక వాళ్ళు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పు, అయినా వీడికి ఆడవాళ్ళని చూస్తే సిగ్గు, మగాళ్ళని చూస్తే భయం' అంటుంది.

ఇలాగే ఉంటుంది వాళ్ళ ధోరణి. ఆ ధోరణే నన్ను ఇలా తయారుచేసింది. తెలిసీ వాళ్ళని అడగడం దేనికి? ఇంకా బాధను పెంచుకోవడం తప్ప.

నా జీవితానికీ పార్కులకీ ఎంతో సంబంధం ఉంది. నా ఏడుపుని, ఆవేదననీ కొద్దిగానైనా అర్థం చేసుకుని నన్ను చూసి జాలి పడేవి.

నన్ను ఒంటరిగా ఉంచుతుంది. జనానికి దూరంగా వాళ్ళ ఆనందాలకి, కేరింతలకీ దూరంగా, ఏకాంతంగా దయగా చూస్తుంది. మనుషులతో కలవాలని తపిస్తూ కలవలేనితనంతో ఒంటరినైపోయిన నన్ను ఆ మొక్కలే ఓదార్చుతాయి.

సాయంత్రం పార్కుకిపోయి, ఓ మూలగా బల్లమీద కూర్చున్నాను.

ఎక్కడ ఉన్నా ఆందోళనే. ఎవరో నన్ను గమనిస్తున్నారని, వింతగా చూస్తున్నారని. అలా అని అనుకోవడమేనని, ఎవరూ నన్ను పట్టించుకోరని కూడా నాకు తెలుసు. కానీ ఏం లాభం? నాలో నామాట వినేదెవరు? లోపల ఆత్మ అనేది ఉంటేగా? నా లోపల అన్నీ అనుమానాలు, భయాలు, సందేహాలు, శంకలూ, దిగుళ్ళే గదా? ఎవరూ ఎదుట లేకుండానే నేనే ఒక సృష్టిచేసి దానికి నన్ను గమనిస్తున్నారనే లక్ష్యాన్ని ఆపాదించి దానికి తగ్గట్లుగా కృత్రిమంగా ప్రవర్తిస్తుంటాను. ఇది మహాభయంకర రోగంలా తయారైంది. దీన్ని ఒదుల్చుకోవాలని తెలుసు కానీ దానికి లోబడి బ్రతకాల్సి వస్తోంది. అదో వింత విషాదం.

పార్కులో కూర్చున్నా అదే ఆందోళన. ఇంటర్వ్యూ గురించే. ఏం చేయను? ఏం చేయను? ఇన్నేళ్ళ చదువుకీ ఫలితం కళ్ళెదురుగా ఉంది. అందుకోవడానికి అవకాశం కనబడడం లేదు.

> ప్రోగ్రెస్ కార్డ్ ఏదిరా? చింటూని ప్రశ్నించింది తల్లి.
>
> కిట్టూ తీసికెళ్లాడమ్మా.
>
> ఎందుకు?
>
> ముందుగా నా కార్డ్ చూపించి వాళ్ళ అమ్మానాన్నలను ఏడ్పిస్తానని అంటే నేనే ఇచ్చాను.

అంగవైకల్య రిజర్వేషన్‌లా ఆత్మ లేని వాళ్ళకి రిజర్వేషన్ పెట్టి ఉద్యోగం ఇవ్వచ్చుగా?

ఎలా? ఆత్మ ఉందో లేదో ఎలా తెలుస్తుంది? ఎలా కనిపెడతారు? ఆత్మ లేదని కనిపెట్టే యంత్రాలూ వస్తే బాగుండును. అవి మాత్రం ఎలా వస్తాయి? ఆత్మ లేని వాళ్ళు ఎందుకుంటారు? వాళ్ళ గురించి ఎవరికి కావాలి. ఆత్మ లేని వాళ్ళు వ్యాపారానికి పనికిరారుగా!

"ఏమండీ మీరు ఆర్టిస్ట్ రాఘవరావుగారి అబ్బాయి కదా?"

"అవునండీ"

"మీరు బియిడి కదా? ఇంట్రవ్యూ వచ్చిందా మీకు?"

"వచ్చింది"

"ఎప్పుడు మీకు?"

"మూడున"

"నాకు ఒకటండీ" ప్రక్కన కూర్చున్నాడు. తరువాత ఏం మాట్లాడాలో నాకు తెలియడం లేదు. వెళ్ళిపోతే బాగుండును అతను. ఏం మాట్లాడాలో తెలియడం లేదు కాబట్టి అతను వెళ్ళిపోవాలని కోరుకోవడం. ఏదో నాన్న పేరు చెప్పి వచ్చాడు. అతనితో నాలుగు మాటలు మాట్లాడి స్నేహం చేసుకోవచ్చుగా. కాని ఏం మాట్లాడాలో తెలియదు. మౌనంగా కొద్దిసేపు

గడిచింది.

"మీ నాన్నగారు బాగా యాక్ట్ చేస్తారండీ... మంచి నటులు"

నవ్వాను. ఏం అనాలో తెలియట్లేదు. కొద్ది సేపు కూర్చుని "వస్తానండీ" అంటూ వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయాక ఆలోచన. అతన్ని ఇంటర్వ్యూ గురించి అడిగితే బాగుండేదని.

ఏమైనా చెప్పేవాడేమో! ఛఛ అతనుండగా ఎప్పుడు పోతాడు అని, పోయాకా అడగలేదనీ... ఏమిటో... పోనీ పార్కులో ఎక్కడైనా ఉన్నాడేమో చూసి వెళ్ళి అడిగితేనో?

లేచి నిలబడి పార్కంతా చూసాను. ఎక్కడా కనిపించలేదు. రేపు కూడా పార్కుకి వస్తాడేమో? రేపు తప్పకుండా అడగాలి. నా అంతట నేను అతనిలా పలకరించి మాట్లాడాలి.

ఆ మర్నాడు పార్కులో అతను కనిపించాడు కానీ నన్ను పలకరించలేదు. దానితో నేనే పలకరించాలన్న ఆలోచన ఆరిపోయింది. పలకరించినా ఆగడేమోనని, అసలు పట్టించుకోడేమోనని... ఒక్క నాన్న పట్టించుకోకపోవడం వల్ల ప్రపంచమంతా పట్టించుకోరేమో నన్న భయం... ఈ భయమే నన్ను ఒంటరిని చేసింది. నాశనం చేసింది.

నిద్ర సరిగా లేకుండా, తిండి సరిగా సయించకుండా, తోచకుండా నాలుగు రోజులూ గడిచాయి.

ఈ రోజే ఇంటర్వ్యూ. మూడో తారీఖు రానే వచ్చింది. ఏవో పుస్తకాలు తిరగేస్తూనే ఉన్నాను రాసైమంటే రాసేస్తాను. కానీ ఎవరి ముందైనా నిలబడి చెప్పమంటే ఐపోతాను... విగ్రహంలా మాటరాదు.

'నాన్న నాతో వస్తే బాగుండును' అనుకున్నా. 'రారేమో, నవ్వుతారేమో!' చాలాసేపు తర్జన భర్జన పడ్డాక అమ్మతో అన్నాను.

"నాన్న నాతో వస్తారా అమ్మా?"

"నాన్న ప్రొద్దునే ఊరెళ్ళారుగా చూళ్ళేదా?"

"ఊరెళ్ళారా? గదిలో ఉన్నారనుకున్నానే!"

"లేర్రా, రేపు ఏదో నాటకం ఉందట"

అయ్యో, రాను... అని చెప్పడం వేరు. అసలు మనిషే లేరు. నా శని ఇలాగే ఉంటుంది. నాకు పనులు జరుగనివ్వదు. నాకంటే ముందే ఉంటుంది.

అమ్మ పెట్టిన టిఫిన్ తినేసి, ఫైల్ తీసుకొని ఇంట్లోంచి బయటకొచ్చాను.

ఒకటే ఆందోళన, భయం. మొఖంలో నెత్తురు మాయం అయిపోతోంది. అమ్మ అస్తమానూ అనే దేభ్యం మొఖం వేలాడుతోంది మెడ మీద.

బస్సు ఎలా ఎక్కానో, ఎలా జిల్లా పరిషత్ చేరానో ఆందోళనలో తెలియడం లేదు. కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్వ్యూలు జరుగుతున్నాయిలా ఉంది. కింద కొద్దిమంది కనిపిస్తున్నారు.

పైన చాలామంది ఉన్నారు. బయట బల్లల మీద వరుసగా కూర్చుని ఉన్నారు. నేను రావడం చూసి అందరూ నాకేసి తిరిగారు. సిగ్గుపడిపోయాను. అంతమంది ఒకేసారి నాకేసి చూస్తున్నారు అనుకునేసరికి బుర్ర పనిచేయలేదు గబాగబా వెళ్ళి చివర కూర్చున్నాను.

"మీ నెంబరెంత?"

చెప్పాను.

"మీరు ఈ బల్ల కాదు ఆ బల్ల మీద కూర్చోవాలి"

అతను చెప్పిన బల్లమీద కూర్చున్నాను.

అందరూ ఏవో చెప్పుకుంటున్నారు. అక్కడున్న ఎవరూ నాకు తెలియదు. ఎవరూ నాతో

మాట్లాడడం లేదు. నేను మాట్లాడలేను. వాళ్ళ మాటలు నా చెవిన బడుతున్నాయి.

"కలెక్టరు సైన్సులా ఉందిరా సైన్సులో చాలా టఫ్ క్వశ్చన్స్ అడుగుతున్నాడట"

"ఛైర్మన్ సోషల్లా ఉంది సోషల్లో తినేస్తున్నాడుట"

"డియిఓ లెక్కలు దంచేస్తున్నాడు"

"సియిఓ జనరల్ నాలెడ్జ్ అడుగుతున్నాడు"

అంటే నలుగురు ఇంటర్వ్యూ చేస్తున్నారు. అందరూ జిల్లా అధికారులే. వాళ్ళందరూ అటు వైపు. ఇవతల నేను. నన్ను అందరూ అడగడం నేను చెప్పాల్సి రావడం... నాకు విపరీతమైన ఆందోళన, భయం, వణుకు మొదలైపోయాయి. వళ్ళంతా చెమటలు పట్టేసాయి. మొఖం తడిసిపోతున్నది. బుర్ర ఖాళీ అయిపోతోంది...

ఇంత ఆందోళన, వేదన నేను పడ్తూ ఉంటే అసలు అక్కడ నేను ఉన్నట్లే ఎవరికీ పట్టడం లేదు. ఎవరి మాటల్లో వాళ్ళున్నారు. నాకే ఎవరితో ఏ సంబంధమూ లేదు.

కొద్దిసేపు నిలబడ్డాను. మళ్ళీ కూర్చున్నాను. అటూ ఇటూ కదిలాను. తల విదిలించాను. ఏం చేసినా ఆందోళన. భయం పెరిగి, ఒళ్ళంతా గుండెల నిండా ఆక్రమించేస్తోంది.

బల్ల మీద కూర్చోలేకపోతున్నాను. గాబరా... గుండెల్లో అంతా గాబరా. ఆగిపోతుందా అనిపించే దడదడ... శరీరమంతా రక్తం సల సల కాలిపోతున్నది.

అరికాలు నుంచి నడినెత్తి వరకూ రక్తం పిచ్చిగా పరుగులు పెడుతోంది. బుర్ర పనిచేయడం లేదు. అంతా శూన్యం అయిపోయింది.

తట్టుకోలేకపోతున్నాను. ఈ పరిస్థితిని తట్టుకోలేకపోతున్నాను. బాబోయ్ ఈ పరిస్థితిలో నేను లోపలికి వెళ్ళలేను. ఈ భయానక స్థితిని ఇక భరించలేను.

నా నెంబరుకి రెండు నెంబర్ల ముందు నెంబరు పిల్చారు. దాంతో ముందు కన్నా ఆందోళన, భయం విపరీతంగా ఉప్పెనలా పెరిగిపోయాయి. గుండెల్లో రాయి పడ్డట్టుగా బరువైపోయింది. ఊపిరి కష్టం అయిపోతోంది. గుండె ఆగిపోతుందేమో అనిపిస్తోంది. చచ్చిపోతానేమో అనిపిస్తోంది. చచ్చినా ఎవరూ పట్టించుకోరు.

నా నెంబరు ముందు నెంబరు పిల్చారు. అతను వెళ్ళడం కనిపించింది. ఇక నాకేం కనబడడం లేదు. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. తలదిమ్మెక్కిపోతోంది. స్పృహ తప్పేలా ఉంది. కళ్ళు తిరుగుతున్నాయి. తరువాత నా నెంబరే... నా నెంబరే... నా నెంబరే...

నా ముందు అతను ఇంకొద్ది సేపట్లో బయటకు వచ్చేస్తాడు. నా నెంబరు పిలుస్తారు. పిలుస్తారు... నా గుండె ఆగిపోతోంది. ఆగిపోతోంది...

లేచి నిలబడ్డాను. ఆ దుర్భర, దుస్సాహ పరిస్థితి నన్ను మెట్లవైపుకి నెట్టింది. కాళ్ళ క్రింద నెమ్మదిగా ఒక్కొక్క మెట్టూ కరిగిపోతోంది. వెనుక నుంచి నా నెంబరు నిస్సహాయంగా ఆత్మహత్య చేసుకోవడం నా మట్టి బుర్రకు తెలుస్తూనే ఉంది.

ఈ కథ చదవడం పూర్తయ్యాక ఇంత దారుణమైన వ్యక్తులుంటారా అని మీకు అనిపించవచ్చు. కానీ ఉన్నారు. దయచేసి అటువంటి వాళ్ళు మీ జీవితంలో ఎదురైతే వాళ్ళని పట్టించుకొని ఓ మంచి మాట మాట్లాడండి. వారిలో ఆత్మకు జీవం పోయండి. ఆత్మ మీరివ్వండి... విశ్వాసం వాళ్ళే వృద్ధి చేసుకుంటారు. ●